సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శుక్రవారం ׀ 6 ׀ జనవరి ׀ 2023



వయసులో చిన్న.. ప్రతిభలో మిన్న

నెల్లూరుకు చెందిన అనీష్ బ్యాడ్మింటన్‌లో రాణిస్తున్నాడు. జాతీయ స్థాయిలో అండర్-15 సింగిల్స్‌లో విజేతగా నిలిచాడు. అనంతరం అంతర్జాతీయ పోటీల్లో సిల్వర్‌మెడల్ సాధించి సత్తా చాటాడు.

8లో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.57,460
22 క్యారెట్ల ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,132
3 శాతం జీఎస్టీతో	రూ.5,286
సవర (8 గ్రా)	రూ.42,288

గరిష్టం/కనిష్టం 30.7 /23.5

వాతావరణం

గురువారం గాలిలో 70 శాతం తేమ ఉంది. శుక్రవారం పొడి వాతావరణం ఉంటుంది. రాత్రి చలి వాతావరణం ఉంటుందని అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

బుచ్చి తహసీల్దార్ సస్పెన్షన్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లాలోని బుచ్చిరెడ్డి పాళెం మండల తహసీల్దార్ ప్రమీలపై సస్పెన్షన్ వేటు పడింది. మండలంలోని మినగల్లు గ్రామంలో భూముల రీ సర్వే ప్రక్రియలో నిబంధనలు పాటించకపోవడంతో కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు ఆమెను సస్పెండ్ చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

97.19 శాతం మందికి పింఛన్లు



నెల్లూరులో గోపాల్‌కు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ అభి

నెల్లూరు(పొగతోట): వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ ప్రక్రియ జిల్లాలో వేగవంతంగా జరుగుతోంది. గురువారం నాటికి 97.19 శాతం మంది లబ్ధిదారులకు కానుక చేరింది. మొత్తంగా 3,14,237 మందికి గానూ ఇప్పటి వరకు 3,05,406 మందికి పెన్షన్లు అందజేశారు. పలువురు ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో జరిగిన వారోత్సవాల్లో కొత్త లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు.

ప్రశాంతంగా ఎస్‌ఏ-1 పరీక్షలు



విద్యార్థులతో మాట్లాడుతున్న సుబ్బారావు

నెల్లూరు(టౌన్): జిల్లా వ్యాప్తంగా సమ్మేటివ్-1 పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని ఇన్‌చార్జి డీఈఓ సుబ్బారావు తెలిపారు. నెల్లూరులోని పొదలకూరు రోడ్డులో ఉన్న జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో సమ్మేటివ్-1 పరీక్షల నిర్వహణ తీరును గురువారం ఆయన, సమగ్రశిక్ష ఏపీసీ ఉషారాణి పరిశీలించారు. అనంతరం నాడు-నేడులో భాగంగా జరుగుతున్న అదనపు గదుల నిర్మాణాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీప్రసన్న కుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కో-ఆర్డినేటర్ నియామకం

నెల్లూరు: సచివాలయాలు, గృహ సారథులకు సంబంధించి ప్రకాశం, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల కో-ఆర్డినేటర్‌గా పుట్టా శివశంకర్‌రెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

వైద్యారోగ్య శాఖలో ఖాళీల భర్తీకి చర్యలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): కమిషనర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ ఆదేశాల మేరకు జిల్లా వైద్యారోగ్య శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకున్నామని డీఎంహెచ్‌ఓ ఎం.పెంచలయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆడియోలజిస్ట్ కమ్ స్పీచ్ థెరపిస్ట్-1, సెక్యూరిటీ గార్డు-1 పోస్టులను కాంట్రాక్టు విధానంలో నియామకాలు చేపడుతున్నట్లు తెలియజేశారు. ఇతర వివరాలకు, దరఖాస్తు చేసేందుకు spsrnellore. ap. gov. in/ notice/ recruitment వెబ్‌సైట్‌ను చూడాలని సూచించారు. అభ్యర్థులు అన్ని సర్టిఫికెట్లు జతపరిచి నెల్లూరులోని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి కార్యాలయంలో ఈనెల 7వ తేదీ లోగా ఉదయం 10.30 నుంచి సాయంత్రం ఐదుగంటల్లోపు అందజేయాలని తెలిపారు.

పంట పండింది

ప్రకృతి అనుకూలించింది. వర్షాలు సమృద్ధిగా కురిశాయి. జలాశయాలు నిండుకుండలా మారాయి. చెరువులు జలకళ సంతరించుకున్నాయి. వెరసి ధాన్యాగారంగా ప్రసిద్ధి చెందిన జిల్లాలో మూడేళ్లుగా గణనీయమైన పంట దిగుబడులతో అన్నదాతల మోముల్లో చిరునవ్వు వచ్చింది. దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో వ్యవసాయ అభివృద్ధికి తీసుకున్న నిర్ణయాల ఫలితంగా ప్రతి రైతు ఇంట ధాన్యపు సిరులు కురిశాయి. చంద్రబాబు పాలనలో కరువు రాజ్యమేలింది. మళ్లీ రాజన్న తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో వ్యవసాయానికి పూర్వవైభవం వచ్చింది. ఫలితంగా వ్యవసాయం పండగలా మారింది.

ధాన్యాన్ని లారీలోకి లోడ్ చేస్తున్న కూలీలు (ఫైల్)



- రికార్డు స్థాయిలో సోమశిల, కండలేరుల్లో నీటి నిల్వలు
- డిమాండ్‌కు మించి ధాన్యం దిగుబడి
- ప్రతి గింజ కొని నిల్వ చేసుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నం
- వేగంగా గోదాముల నిర్మాణం

జిల్లాలో మూడేళ్లలో పెరిగిన వరి విస్తీర్ణం

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: సింహపురి జిల్లాలో వరి సిరులు కురిపించింది. గడిచిన మూడేళ్లుగా ధాన్యం రెట్టింపు దిగుబడి లభించింది. ప్రతి ఏటా రైతులు రికార్డు స్థాయిలో దిగుబడులు సాధించారు. అందుకు తగినట్లుగా ధరలు రావడంతో వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. చెరువులు, ప్రాజెక్టుల్లో నీరు సమృద్ధిగా ఉండడమే దీనికి ప్రధాన కారణం. పైతట్టు ప్రాంతాల్లో వర్షాలు బాగా కురిసి వరద పెన్నానది ద్వారా సోమశిల, కండలేరు ప్రాజెక్టులకు చేరుతోంది. గడిచిన మూడేళ్లుగా ఈ పరిస్థితులు ఉండడంతో ఆ రెండు ప్రాజెక్టుల్లో రికార్డు స్థాయిలో నీటి నిల్వలు చేసి సాగునీరు అందించారు. తద్వారా సాగునీటికి ఎలాంటి ఢోకా లేకుండా కర్షకులు పంటలు సాగు చేస్తున్నారు.

ధాన్యం నిల్వ చేసేందుకు..

ధాన్యం నిల్వ చేసుకునేందుకు జిల్లాలో 62 గోదాములున్నాయి. వాటిలో 63 వేల మెట్రిక్ టన్నుల నిల్వకు మాత్రమే అవకాశం ఉంది. దీంతో ఈ ప్రభుత్వం కొత్తగా రూ.29 కోట్లతో మరో 48 గోదాములను నిర్మించేందుకు శ్రీకారం చుట్టింది. అందులో 21 నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. అవి పూర్తయితే సుమారు 40 వేల మెట్రిక్ టన్నులు నిల్వ చేసే సౌకర్యం అందుబాటులోకి వస్తుంది. ఇంకా కేంద్ర గిడ్డంగుల సంస్థ, ప్రైవేట్ గోదాముల్లో మరో 5 లక్షల మెట్రిక్ టన్నులు నిల్వ చేసుకునే సౌకర్యం జిల్లాలో ఉంది. గిట్టుబాటు ధరలు లభించేంత వరకూ నిల్వ చేసుకుని తర్వాత విక్రయించుకునే వెసులుబాటు పుష్కలంగా ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

నీటితో కళకళ

జిల్లాలో మొత్తంగా 1,918 చెరువులు ఉండగా, వాటన్నింటికీ నీరు చేరింది. మూడేళ్లుగా చెరువుల్లో పుష్కలంగా నీరు ఉండడంతో వ్యవసాయం సాఫీగా జరిగింది. ప్రాజెక్టుల క్యాచ్‌మెంట్ ఏరియా (నదీ పరివాహక ప్రాంతం) అధికంగా ఉన్నా టీడీపీ ప్రభుత్వ హయాంలో అరకొరగానే నీరు చేరింది. 2015-16 మినహా తక్కిన నాలుగేళ్లు స్వల్ప చేరికలే నమోదయ్యాయి. ఆయకట్టు సాగుబడి కూడా 50 శాతానికి మించలేదు. ఆ మేరకు అధికారిక రికార్డులు రుజువు చేస్తున్నాయి. భూగర్భజలాలు అడుగంటిపోయి, ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేయాల్సిన దుస్థితి తలెత్తింది. తాగునీటి రవాణా కోసం 2014-19లో సుమారు రూ.58 కోట్లు వెచ్చించారు. చంద్రబాబు హయాంలో దుర్భిక్షంతో జనం అల్లాడిపోయారు. వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో తాగునీటి సరఫరా పరిస్థితులే తలెత్తలేదు. ఆ ఖర్చంతా ఆదా అయ్యింది.

మూడేళ్లలో వరి సాగు, దిగుబడి ఇలా..

ఏడాది	ఖరీఫ్‌లో సాగు (హెక్టార్లలో)	దిగుబడి (మెట్రిక్ టన్నులు)	రబీలో సాగు (హెక్టార్లలో)	దిగుబడి (మెట్రిక్ టన్నులు)
2019-20	16,607	1,01,958	2,15,725	15,26,902
2020-21	52,223	3,33,481	2,24,307	15,69,149
2021-22	69,911	4,46,032	2,44,776	17,13,432
(పై గణాంకాలు ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిధిలో..)				
ప్రస్తుతం జిల్లా పరిధిలో..				
2022-23	1,02,000	5,02,214	3,00,000	

అత్యధికంగా..



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ప్రాజెక్టులు, చెరువులు నీటితో కళకళలాడుతున్నాయి. 2019 నుంచి 2022 వరకు సోమశిలలో అత్యధిక స్థాయిలో 73 టీఎంసీలను నిల్వ చేశారు. కండలేరులో సైతం అత్యధికంగా 62 టీఎంసీల నీరు నిల్వ చేసిన ఘనత దక్కింది. భూగర్భ జలాలు సమృద్ధిగా ఉన్నాయి. ఈసారి చివరి ఆయకట్టు వరకూ సోమశిల ద్వారా జిల్లాలో నీరు అందించారు. దీంతో రైతుల పంట పండిందని వ్యవసాయ నిపుణులు వివరిస్తున్నారు.

గణనీయంగా..

టీడీపీ హయాంలో 2015లో మాత్రమే చెప్పుకోదగిన రీతిలో 4.5 లక్షల ఎకరాలు సాగులోకి వచ్చింది. మిగిలిన సంవత్సరాల్లో రబీలో 2 లక్షల పైచిలుకు ఎకరాల్లో మాత్రమే సాగు జరిగింది. ఖరీఫ్‌లో 90 వేల ఎకరాలకు మించి సాగులోకి రాలేదు. 2019లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక సకాలంలో వర్షాలు కురవడం, జలాశయాల్లో సమృద్ధిగా నీరు చేరడంతో వరిసాగు గణనీయంగా పెరిగింది. 2019లో 5 లక్షల ఎకరాల ఆయకట్టు సాగులోకి రాగా, 2021-22 ఏడాదిలో 6.12 లక్షల ఎకరాలు ఆయకట్టు వచ్చింది. ఖరీఫ్‌లో సైతం 1.75 లక్షల ఎకరాల్లో పంటలు పండించారు.



2022-23లో ఒక్క సోమశిల జలాశయం పరిధిలోనే మొదటి పంట కింద 2.38 లక్షల ఎకరాలు, రెండో పంట కింద 5.50 లక్షల ఎకరాల్లో పంటలు పండించారు. కండలేరు జలాశయం పరిధిలో మొదటి పంట కింద 1.90 లక్షల ఎకరాలు, రెండో పంట కింద 3.80 లక్షల ఎకరాల్లో సాగు చేశారు.

దిగుబడి బాగా వస్తోంది

మూడేళ్లగా పంట దిగుబడులు బాగా వస్తున్నాయి. ప్రకృతి సహకరించడం, ప్రాజెక్టుల్లో నీరు పుష్కలంగా ఉండడంతో సాగునీరు సకాలంలో అందుతోంది. భూగర్భ జలాలు పెరుగుతున్నాయి. బోర్ల ద్వారా నీరు పుష్కలంగా వస్తోంది. దీంతో పంటలకు ఇబ్బంది లేదు. పంట ఉత్పత్తిని కొనుగోలు చేయడంతో ఆదాయం వస్తోంది.

– చీర్ల భాస్కర్‌రెడ్డి, పాత దేవరాయపల్లి, అనంతసాగరం మండలం



సాగునీటికి ఢోకా లేదు

మూడేళ్లగా సాగునీటికి ఢోకా లేదు. నీరు పుష్కలంగా ఉండడంతో పంట ఉత్పత్తి బాగుంది. దిగుబడి గణనీయంగా పెరిగింది. ప్రభుత్వం ఆర్‌బీకేల ద్వారా కొనుగోలు చేస్తుండడంతో గిట్టుబాటు ధర లభిస్తోంది. మూడేళ్లగా ఏ ఇబ్బంది లేకుండా పంటలు పండించుకుంటున్నాం.

– చుండి సుబ్బారెడ్డి, కోటపాడు, ఆత్మకూరు మండలం



ప్రజల ప్రాణాలంటే చంద్రబాబుకు లెక్కలేదు

- లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వలంటీర్లు పింఛన్లు ఇస్తున్నారు
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

మనుబోలు: 'ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబుకు ప్రచార యావ ఎక్కువ. ప్రజల ప్రాణాలంటే ఆయనకు లెక్కలేదు.' అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలానికి కొత్తగా 231 పింఛన్లు మంజూరయ్యాయి. లబ్ధిదారులకు మనుబోలు డీపీఆర్ కల్యాణ మండపంలో మంత్రి గురువారం నగదు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన రోడ్‌షోలను ప్రభుత్వం అడ్డుకుంటోందంటూ చంద్రబాబు గగ్గోలు పెడుతున్నాడన్నారు. ఆయన ప్రచారయావతో ఇరుకు సందుల్లో కావాలనే రోడ్‌షోలు పెట్టి అమాయకుల ప్రాణాలను బలిపెడుతున్నాడని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ఏదైనా అరిష్టం చోటుచేసుకుందంటే దానికి కారణం బాబే అయ్యుంటాడని మండిపడ్డారు. తన సభలకు ప్రజలు వస్తున్నారని నిరూపించుకునేందుకు తాపత్రయపడుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పింఛన్లపై గోబెల్స్ ప్రచారం

తమ ప్రభుత్వం పింఛన్లు తొలగిస్తోందంటూ చంద్రబాబు గోబెల్స్ ప్రచారం చేస్తున్నాడని కాకాణి మండిపడ్డారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో చేసిన పల్స్ సర్వే కారణంగా పింఛన్ తీసుకుంటున్న లబ్ధిదారుని కుటుంబసభ్యుల్లో ఎవరికైనా కారు ఉన్నా, అధిక విద్యుత్ వినియోగిస్తున్నా, ఉద్యోగం ఉన్నా పింఛన్ పోతుందన్నారు. దీనిని అధిగమించేందుకు కుటుంబ సభ్యుడితో సంబంధం లేకుండా లబ్ధిదారులకు పెన్షన్ అందించాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. వితంతు పింఛన్ తీసుకునేవారు చనిపోయిన వ్యక్తికి సంబంధించి రేషన్ బియ్యం తీసుకుంటే పింఛన్ సౌకర్యం కోల్పోతారని దీనిపై లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.



మాట్లాడుతున్న మంత్రి గోవర్ధన్‌రెడ్డి, చిత్రంలో ప్రజాప్రతినిధులు, అధికారులు

అందరికీ ఇస్తున్నాం

మండలంలో ఏ ఒక్కరి పింఛన్‌ను తొలగించలేదని మంత్రి తెలిపారు. 159 మందికి నోటీసులు అందజేయగా చనిపోయిన ఇద్దరు మినహా మిగిలిన అందరికీ పింఛన్లు అందజేస్తున్నామని తెలిపారు. గతంలో పింఛను తీసుకోవాలంటే గంటల తరబడి క్యూలైన్లలో నిలబడాల్సి వచ్చేదని తెలిపారు. ప్రస్తుతం వలంటీర్లు ఒకటో తేదీన నేరుగా ఇంటికే వెళ్లి నగదు అందజేస్తున్నారని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో బండేపల్లి బ్రాంచ్ కాలువకు ఒక్క రూపాయి నిధులు మంజూరు చేసినట్లు మాజీ మంత్రి సోమిరెడ్డి నిరూపిస్తే తాను మంత్రి పదవికి రాజీనామా చేస్తానని సవాల్ విసిరారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఎంపీపీ వజ్రమ్మ, వైస్ ఎంపీపీలు వెంకటరమణారెడ్డి, చందన, ఎంపీటీసీ రాజేశ్వరమ్మ, నాయకులు హరగోపాల్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్, వెంకటసుబ్బయ్య, మహేంద్ర వర్మ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఓటర్లు 19,13,920 మంది

- ఓటర్ల తుది జాబితా విడుదల
- మహిళలే అధికం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): సాధారణ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల తుది జాబితాను ఎన్నికల సంఘం అధికారులు గురువారం ప్రకటించారు. 2023 సంవత్సరం జనవరి ఒకటో తేదీ నాటికి జిల్లాలో ఓటర్లు 19,13,920 మంది ఉన్నారు. వారిలో మహిళా ఓటర్లు 9,73,802 మంది, పురుష ఓటర్లు 9,39,273 మంది వున్నారు. పురుష ఓటర్ల కన్నా మహిళా ఓటర్లు 34,529 మంది అధికంగా ఉన్నారు. అలాగే థర్డ్ జెండర్ ఓటర్లు 246 మంది, అదేవిధంగా సైనిక అనుబంధ మిలటరీ రంగాల్లో పనిచేస్తున్న సర్వీసు ఓటర్లు 599 ఉన్నారు.

నియోజకవర్గం	సర్వీసు ఓటర్లు	పురుషులు	మహిళలు	థర్డ్ జెండర్
కందుకూరు	67	1,10,038	1,11,441	22
కావలి	95	1,19,239	1,25,184	39
ఆత్మకూరు	58	1,07,555	1,08,874	11
కోవూరు	57	1,28,116	1,37,643	18
నెల్లూరుసిటీ	51	1,14,369	1,18,740	77
నెల్లూరురూరల్	61	1,27,979	1,34,323	36
సర్వేపల్లి	24	1,13,481	1,18,330	28
ఉదయగిరి	186	1,19,067	1,19,295	15

సోమశిలలో 71.996 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో గురువారం నాటికి 71.996 టీఎంసీలు ఉన్నాయి. జలాశయానికి 5,073 క్యూసెక్కుల వంతున వరద వచ్చి చేరుతోంది. పెన్నార్ డెల్టాకు 2,520, ఉత్తరకాలువకు 550, దక్షిణకాలువకు 300, కండలేరుకు 1600 క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయంలో 99.760 మీటర్ల నీటి మట్టం ఉంది.

యువత వాస్తవం వైపు నిలబడాలి

- ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు



మాట్లాడుతున్న ప్రెస్ అకాడమీ ఛైర్మన్ శ్రీనివాసరావు

వెంకటాచలం: 'సమాజంలో జరిగే మంచి చెడుల గురించి యువత తెలుసుకోవాలి. అంతిమంగా వాస్తవం వైపు నిలబడాలి.' అని ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మండలంలోని కాకుటూరులో ఉన్న విక్రమ సింహపురి విశ్వవిద్యాలయానికి గురువారం ఆయన విచ్చేశారు. వీసీ జీఎం సుందరవల్లి, రిజిస్ట్రార్ డాక్టర్ పి.రామచంద్రారెడ్డి, జిల్లా సమాచార, పౌరసంబంధాల అధికారి వెంకటేశ్వరప్రసాద్, ఆర్డీఓ మలోల ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జర్నలిజం – విలువలపై విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ యువత జర్నలిజంపై మక్కువ పెంచుకోవాలన్నారు. నిజాయితీగా ప్రజలకు సేవ చేసే అవకాశం జర్నలిజం ద్వారా లభిస్తుందన్నారు. పత్రికలు పక్షపాత ధోరణి వీడి వాస్తవాలను ప్రజలకు తెలపాలన్నారు. ప్రభుత్వ లోపాలను ఉన్నవి ఉన్నట్లు తెలియజేయాలన్నారు.

వాస్తవాలను వక్రీకరించడం దురదృష్టకరం

రోడ్‌షోల వల్ల ప్రజలు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని, వాటిని రద్దు చేసేందుకు ప్రభుత్వం జీఓ విడుదల చేస్తే కొన్ని పత్రికల్లో రోడ్‌షోలకు మద్దతుగా వార్తలు రాయడం సరైంది కాదన్నారు. ప్రతిపక్షాల కంటే కొన్ని పత్రికలు అత్యుత్సాహాన్ని చూపుతూ వాస్తవాలను వక్రీకరించి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నాయని చెప్పారు. ఓ పార్టీ అధినేత రియల్ ఎస్టేట్‌కు ప్రాధాన్యమిస్తుంటే, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమానికి ప్రాధాన్యమిస్తున్నారని చెప్పారు.

నైతిక విలువలు పాటించాలి

నెల్లూరు(బారకాసు): జర్నలిస్టులు నైతిక విలువలు పాటించాలని ప్రెస్ అకాడమీ ఛైర్మన్ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఏపీడబ్ల్యూజే జిల్లాశాఖ ఆధ్వర్యంలో నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీట్ ది ప్రెస్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. సమాజంలో జరిగే వాస్తవాలను తెలియజేయడమే మీడియా ప్రధాన కర్తవ్యమని, దానిని విస్మరించకూడదన్నారు. రెండుచోట్ల జరిగిన తొక్కిసలాటల్లో కొంతమంది ప్రాణాలు పోయాయని, ఈ విషయంలో రెండు ప్రధాన పత్రికలు వాస్తవాలను ప్రచురించకపోవడం దారుణమన్నారు. ఈ సందర్భంగా పలువురు విలేకరులు అడిగిన ప్రశ్నలకు కొమ్మినేని సమాధానమిచ్చారు. జర్నలిస్టులకు ఇంటి నివేశన స్థలాలు, హెల్త్‌కార్డులకు సంబంధించిన విషయాలను తాను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లానన్నారు. కరోనా సమయంలో విధులు నిర్వర్తిస్తున్న క్రమంలో మృతిచెందిన వారికి సంబంధించి కుటుంబాలను ఆదుకునే విషయాన్ని తీసుకెళ్లానన్నారు. జర్నలిజం కోర్సును విశ్వవిద్యాలయాల్లో ప్రవేశపెట్టేందు కోసం ప్రత్యేక దృష్టి సారించామన్నారు. వ్యవహారిక భాషలో కోర్సులను రూపొందిస్తున్నట్లు చెప్పారు. విలువలతో కూడిన జర్నలిజాన్ని భావితరాలకు అందించాలనేదే తన ప్రయత్నమన్నారు. కార్యక్రమంలో డీడీ వెంకటేశ్వరప్రసాద్, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి జయప్రకాష్, జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



హాజరైన విద్యార్థులు తదితరులు

క్లుప్తంగా

కాన్పూర్ ఐఐటీకి మట్టి నమూనాలు



మట్టి నమూనాలు సేకరిస్తున్న వ్యవసాయాధికారులు

ముత్తుకూరు : పొలాల్లో సేకరించే మట్టి నమూనాలను పరీక్షల నిమిత్తం కాన్పూర్ ఐఐటీకి పంపిస్తామని ఇందుకూరుపేట వ్యవసాయ సహాయ సంచాలకుడు రాజకుమార్ చెప్పారు. ముత్తుకూరు ఆర్బీకే పరిధిలోని వేరుశనగ పంటపొలాల్లో గురువారం మట్టి నమూనాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి మండలం నుంచి అర కిలో చొప్పున ఆరు మట్టి నమూనాలు సేకరిస్తామన్నారు. అరకిలో మట్టిలో సగం నెల్లూరు భూసార పరీక్ష కేంద్రానికి, మిగిలిన సగం కాన్పూర్ ఐఐటీ కళాశాలకు పంపిస్తామన్నారు. ఈ కళాశాలలో విద్యార్థులు సాయిల్ టెస్ట్ కిట్‌ను రూపొందిస్తున్నారని, ఈ కిట్‌ల రూపకల్పనకు మట్టి నమూనాలను ఉపయోగిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, సచివాలయ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

మంత్రి నివాసం వద్ద భద్రతా ఏర్పాట్ల పరిశీలన

నెల్లూరు(క్రైమ్) : సెక్యూరిటీ ఆడిట్‌లో భాగంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఇంటివద్ద భద్రతా ఏర్పాట్లను ఐఎస్‌డబ్ల్యూ(ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్) డీఎస్పీ ఎస్వీ రమణ ఆధ్వర్యంలో సిబ్బంది గురువారం పరిశీలించారు. మంత్రి భద్రత విషయంలో ఇంకేమైనా జాగ్రత్తలు తీసుకోవాలా? సీసీ కెమెరాల ఏర్పాటు? బందోబస్తు పెంపు ఇలా అనేక కోణాల్లో పరిశీలించారు. అనంతరం జిల్లా పోలీసు అధికారులతో చర్చించారు. ప్రతి ఏటా ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ అధికారులు ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజాప్రతినిధుల భద్రత చర్యలపై తనిఖీలు చేసి తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు ఇస్తుంటారు. ఈ తనిఖీల్లో ఏఆర్ డీఎస్పీ గాంధీ, వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ నరసింహారావు పాల్గొన్నారు.

క్షయవ్యాధి సర్వేకు సహకరించండి

- జిల్లా క్షయ నివారణాధికారి డాక్టర్ వెంకటప్రసాద్




సర్వే సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ వెంకటప్రసాద్

ఆత్మకూరు : కేంద్ర, రాష్ట్ర ఆరోగ్య శాఖల సూచనల మేరకు క్షయ వ్యాధిపై క్షేత్రస్థాయిలో సర్వే జరుగుతోందని, ప్రజలు సర్వే చేస్తున్న సిబ్బందికి సహకరించాలని జిల్లా క్షయవ్యాధి నివారణాధికారి డాక్టర్ వెంకటప్రసాద్ అన్నారు. ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని పలు కాలనీల్లో గత 20 రోజులుగా జరుగుతున్న క్షేత్రస్థాయి క్షయవ్యాధి సర్వేను ఆయన గురువారం పరిశీలించారు. ఏసీఎస్ ఆర్ కాలనీలో సర్వే చేస్తున్న సిబ్బందితో మాట్లాడి సర్వే తీరుతెన్నులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు మున్సిపల్ పరిధిలో 2,500 మందికి పరీక్షలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ సర్వేను కేంద్ర ఆరోగ్య శాఖ నుంచి ఇద్దరు డాక్టర్ల బృందం పర్యవేక్షణ చేయనుందని తెలియజేశారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, బరువు తగ్గడం, ఆకలి మందగించడం వంటి లక్షణాలు ఉన్న వారు ప్రభుత్వాస్పత్రిలో ఉచితంగా పరీక్షలు నిర్వహించుకోవచ్చని ఆయన వివరించారు. సర్వే చేస్తున్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది విజయ్, శ్రావణ్, వెంకటేశ్వర్రావు, సుధాకర్, క్షేత్రస్థాయి సిబ్బంది అనిత, సునంద తదితరులు పాల్గొన్నారు.

వయసులో చిన్న.. ప్రతిభలో మిన్న

తొలి ప్రయత్నంలోనే ఇంటర్నేషనల్ సిల్వర్‌మెడల్



- బ్యాడ్మింటన్‌లో రాణిస్తున్న అనీష్ డాని
- జిల్లా నుంచి మొదటి అంతర్జాతీయ క్రీడాకారుడు

ఆ కుర్రాడు వయసులో చిన్నవాడే అయినా రికార్డుల సాధనలో పెద్దలనే మించిపోయాడు. నెల్లూరు నగరానికి చెందిన అనీష్ డాని జిల్లా నుంచి మొదటిసారిగా అంతర్జాతీయ బ్యాడ్మింటన్‌లో సిల్వర్‌మెడల్ సాధించి సత్తాచాటాడు. ఏషియన్ జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో పాల్గొని జిల్లా పేరును అంతర్జాతీయ క్రీడావేదికపై రెపరెపలాడించాడు. తొలి ప్రయత్నంలోనే ద్వితీయస్థానంలో నిలిచి భారతదేశానికి, రాష్ట్రానికి, జిల్లాకు బ్యాడ్మింటన్‌లో ప్రత్యేక స్థానాన్ని నిలిపాడు. భవిష్యత్‌లో అంతర్జాతీయ క్రీడావేదికపై మరింతగా రాణించి జిల్లాకు ఘనకీర్తిని అందిస్తాడని క్రీడాభిమానులు ఆశిస్తున్నారు.



తల్లిదండ్రులతో అనీష్ డాని



ఆంధ్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ద్వారకానాథ్ చేతులమీదుగా సన్మానం అందుకుంటున్న అనీష్ డాని (ఫైల్)

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : నెల్లూరు నగరానికి చెందిన తొప్పాని రమేష్ పోలీస్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. ఆయన సతీమణి సుజీవనరాణి గృహిణి కాగా వీరికి ఇద్దరు సంతానం. అమ్మాయి అంశు డయానా, అబ్బాయి అనీష్ డాని. నెల్లూరులోని ఓ ప్రైవేట్ పాఠశాలలో అనీష్ విద్యాభ్యాసం పూర్తి చేశాడు. ప్రస్తుతం నాయుడుపేటలో జూనియర్ ఇంటర్మీడియట్ చేస్తున్నాడు.

చిన్నప్పటి నుంచే క్రీడలపై ఆసక్తి

తండ్రి రమేష్ నెల్లూరు మూలాపేట పోలీస్ క్వార్టర్స్ వద్ద అవుట్‌డోర్ బ్యాడ్మింటన్ కోర్టులు వేసి సహోద్యోగులతో రోజూ బ్యాడ్మింటన్ ఆడేవారు. పెద్దలందరూ బ్యాడ్మింటన్ ఆడుతూ ఉంటే అనీష్ డాని చూస్తుండేవాడు. ప్రతి ఆదివారం తన తండ్రి రమేష్‌తో ఆడేవాడు. తన కున్న చురుకుదనం, క్రీడల పట్ల ఆసక్తిని గమనించి తండ్రి 2016లో ఆరో తరగతి చదువుతున్న డానీని సీనియర్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు రాకేష్ చౌదరి వద్ద సాధనకు పంపారు. కోచ్ వెంకటేష్ ప్రత్యేక శిక్షణలో అనీష్ డానీని చిన్నవయస్సులోనే పెద్ద క్రీడాకారుడిగా అడుగులు వేసేందుకు ఉపకరించింది. నెల్లూరులో 2017లో జరిగిన రాష్ట్ర మినీ చాంపియన్ షిప్ పోటీల్లో మూడో స్థానంలో నిలిచాడు. అప్పటి నుంచి ప్రతి ఏడాది జరిగిన టోర్నీల్లో ఒకటి, రెండు స్థానాల్లో నిలుస్తూ తన క్రీడాప్రతిభను మెరుగుపరుచుకుంటూ మెడల్స్ సాధించడం ఆరంభించాడు.

తొలి ప్రయత్నంలోనే..

ఆటతప్ప మరే ఆలోచన లేని అనీష్ డాని 2019, 2020 కరోనా సంవత్సరాలు పోగా 2022లో అండర్-15 సింగిల్స్‌లో జాతీయస్థాయిలో విజేతగా నిలిచి అంతర్జాతీయ పోటీలకు అర్హత సాధించాడు. 2022 థాయ్‌లాండ్‌లో జరిగిన ఏషియన్ జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో రెండో స్థానం సాధించి సిల్వర్ మెడల్ సొంతం చేసుకున్నాడు. నెల్లూరు జిల్లా నుంచి మొదటిసారిగా అంతర్జాతీయ స్థాయిలో పాల్గొని తొలి ప్రయత్నంలోనే పతకం సాధించాడు.

ప్రోత్సాహం

అనీష్ డాని క్రీడాప్రతిభను గుర్తించిన కోచ్ వెంకటేష్ ఆటలో మెళకువలు నేర్పిస్తే ఆంధ్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ ప్రత్యేక ప్రోత్సాహం అందించి దేనిని తీర్చిదిద్దారు. అతనికి కావల్సిన క్రీడా పరికరాలను అందించారు. జాతీయ, అంతర్జాతీయస్థాయిలో రాణిస్తున్నప్పుడు సింహపురి స్పోర్ట్స్ ఫౌండేషన్ ద్వారా స్పాన్సర్స్‌ను ఏర్పాటు చేశారు. సిల్వర్‌మెడల్‌కు సంబంధించిన క్యాష్ ప్రైజ్ వస్తే చాలా వరకు ఆర్థిక ఇబ్బందులు తీరుతాయని తండ్రి రమేష్ తెలిపారు.



సాధన చేస్తున్న అనీష్ డాని

సాధించిన పతకాలు

జిల్లాస్థాయిలో		
2018	అండర్-13 (సింగిల్స్)	ఫస్ట్‌ప్లేస్
2018	అండర్-13 (డబుల్స్)	ఫస్ట్‌ప్లేస్
2018	అండర్-15 (సింగిల్స్)	ఫస్ట్‌ప్లేస్
2018	అండర్-15 (డబుల్స్)	ఫస్ట్‌ప్లేస్
రాష్ట్రస్థాయిలో		
2018	అండర్-13 (సింగిల్స్)	ఫస్ట్‌ప్లేస్
2022	అండర్-17 (సింగిల్స్)	సెకండ్‌ప్లేస్
మినీస్టేట్		
2018	అండర్-13 (సింగిల్స్)	సెకండ్‌ప్లేస్
జాతీయస్థాయిలో		
2019	అండర్-13 (సింగిల్స్)	ప్రీ క్వార్టర్‌ఫైన లిస్ట్ (భాగల్పూర్)
2022	అండర్-15 (సింగిల్స్)	క్వార్టర్‌ఫైనలిస్ట్ (పంచకుల)
2022	అండర్-17 (సింగిల్స్)	ప్రీ క్వార్టర్ ఫైనలిస్ట్ (పంచకుల)
2022	అండర్-15 (సింగిల్స్)	క్వార్టర్‌ఫైనలిస్ట్ (గోవా)
2022	అండర్-15 (సింగిల్స్)	మూడో స్థానం (గోపీచంద్ అకాడమీ)
2022	అండర్-15 (సింగిల్స్)	విన్నర్(జ్వాలా గుప్తా అకాడమీ)

అంతర్జాతీయ స్థాయిలో మెడల్స్ సాధిస్తా

చిన్నప్పటి నుంచి చాలామంది ప్రోత్సహించారు. ప్రస్తుతం ఏషియా స్థాయిలో జూనియర్ విభాగంలో రెండో స్థానం సాధించడం సంతోషంగా ఉంది. రానున్న రోజుల్లో మెయిన్స్‌లో ఒలింపిక్స్, వరల్డ్‌కప్ వంటి చాంపియన్‌షిప్స్‌లో మెడల్స్ సాధించడమే ధ్యేయం.
– అనీష్ డాని



నాకేం తెలీదు

- జీతం మాత్రమే తీసుకున్నా..
- ఏసీబీ విచారణలో రోజ్‌మాండ్

నెల్లూరు(క్రైమ్): ఏసీబీ అధికారుల విచారణలో రోజ్‌మాండ్ తనకు ఏమి తెలియదని సమాధానమిచ్చినట్లు తెలిసింది. సివిల్ సప్లయీస్ కుంభకోణం కేసులో గతేడాది డిసెంబర్ 21వ తేదీన అప్పటి సూళ్లూరుపేట ఆర్డీఓ రోజ్‌మాండ్‌ను ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. జిల్లా కేంద్ర కారాగారంలో రిమాండ్‌లో ఉన్న ఆమెను కోర్టు అనుమతితో అదేనెల 24వ తేదీన పదిరోజుల పోలీసు కస్టడీకి తీసుకుని అధికారులు విభిన్న కోణాల్లో విచారణ చేపట్టారు. అయితే ఆమె నుంచి ఎలాంటి సమాచారం రాబట్టలేకపోయారని సమాచారం. కుంభకోణంలో ఆమె పాత్ర, నిధుల దుర్వినియోగం, ఇతరుల ప్రమేయం, ఆస్తులు తదితర విషయాలపై కూపీలాగేందుకు యత్నించారు. తమ వద్ద పక్కా సాక్ష్యాలు ఉన్నాయని నిజం చెప్పాలంటూ ఆమెను కోరగా తనకు ఏమి తెలియదని.. జీతం మాత్రమే తీసుకున్నానన్న సమాధానం మాత్రమే చెప్పినట్లు తెలిసింది. ఎన్నివిధాలా ప్రయత్నించినా ఆ రెండు మాటలు మినహా ఆమె నుంచి మరో మాటను ఏసీబీ అధికారులు రాబట్టలేకపోయినట్లు తెలుస్తోంది. దీంతో రోజ్‌మాండ్ సెల్‌ఫోన్‌ను సీజ్ చేశారు. ఈనెల రెండో తేదీ కస్టడీ ముగియడంతో తిరిగి జైలులో ఆమెను అప్పగించారు.

రూ.14 లక్షల అప్పగింత

కుంభకోణంలో ప్రధాన సూత్రధారి శివకుమార్, దయాకర్‌కు నెల్లూరు నగరానికి చెందిన ఈశ్వర్ కాశీ అలియాస్ రామకోటేశ్వరరావు స్నేహితుడు. వారి ద్వారా రామకోటేశ్వరరావు తన స్నేహితుడికి రూ.14 లక్షలు అప్పుగా ఇప్పించాడు. కేసు విచారణలో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో ఆయన గురువారం రూ.14 లక్షల నగదును ఏసీబీ అధికారులకు అప్పగించినట్లు సమాచారం.

నిమ్మధరలు (కిలో)

పెద్దవి : రూ.17 సన్నవి : రూ.10
పండ్లు : రూ.4

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్) :	122
లేయర్ (లైవ్) :	85
బ్రాయిలర్ చికెన్ :	212
బ్రాయిలర్ స్కిన్‌లెస్ :	236
లేయర్ చికెన్ :	145

క్రికెట్ టోర్నీ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

నెల్లూరు(సెంట్రల్) : సంక్రాంతి పండగను పురస్కరించుకుని నిర్వహించే ఎంజీఆర్ క్రికెట్ టోర్నమెంట్ పోస్టర్‌ను మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి గురువారం నెల్లూరులోని ఆయన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ దివంగత మేకపాటి గౌతమ్‌రెడ్డి జ్ఞాపకార్థం టోర్నీని నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు టోర్నమెంట్ సహకరిస్తుందన్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలోని అన్ని మండలాల క్రీడాకారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు పీర్ల పార్థసారథి, కొమ్మి సిద్ధులనాయుడు, షేక్.బషీర్ తదితరులు పాల్గొన్నారు.

ఐటీ నిబంధనలు అమలు చేయాలి

- ఇన్‌కమ్‌ట్యాక్స్ డిప్యూటీ కమిషనర్ ప్రేమ్‌కుమార్



సమావేశంలో పాల్గొన్న డిప్యూటీ కమిషనర్ ప్రేమ్‌కుమార్, సబ్‌కలెక్టర్ శోభిక

కందుకూరు : బిల్లుల చెల్లింపు, ప్రభుత్వ ఉద్యోగుల జీతాల చెల్లింపులు, ఆర్థిక లావాదేవీల విషయంలో ఇన్‌కమ్‌ట్యాక్స్ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని ఆ శాఖ డిప్యూటీ కమిషనర్ ప్రేమ్‌కుమార్ సూచించారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో డివిజన్ పరిధిలోని డీడీఓలకు సబ్‌కలెక్టర్ శోభికతో కలిసి గురువారం ఆయన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. భూసేకరణ సమయంలో సంబంధిత భూ యజమానికి చెల్లించే పరిహారంపై కూడా ట్యాక్స్ ఉంటుందని, ఐటీ నిబంధన 194ఎల్ఏ ప్రకారం పది శాతం టీడీఎస్ కట్ చేయాలన్నారు. పరిహారం రూ.2.50 లక్షల కంటే ఎక్కువ ఉంటే ట్యాక్స్ కట్ చేయాలని సూచించారు. కో–ఆపరేటివ్ సెక్టార్‌లో రూ.కోటి కంటే ఎక్కువ లావాదేవీలు ఉంటే టీడీఎస్ వర్తిస్తుందని చెప్పారు. వైద్య వృత్తిలో ఉన్న వారు కూడా ఏడాదికి రూ.50 లక్షల కంటే ఎక్కువ సంపాదిస్తే టీడీఎస్ నిబంధనలు వర్తిస్తాయని, అలాగే బిల్డింగ్ విషయంలోనూ టీడీఎస్ నిబంధనలు అమలు చేయవచ్చని వివరించారు. ప్రభుత్వ ఉద్యోగులు అప్లై చేసే ఫారం–16, 16–ఏ నిబంధనల ప్రకారం ఉండాలని, అలా లేకుంటే డీడీఓలకు రూ.10 వేల వరకు జరిమానా విధిస్తామన్నారు. కాంట్రాక్టర్లకు ఇన్‌స్టాల్మెంట్ పద్ధతిలో బిల్లులు చెల్లించే క్రమంలో మొదటి విడతకు 2 శాతం టీడీఎస్ కట్ చేయాలన్నారు. మైన్స్, జియాలజీ శాఖల్లో జరిగే అధిక లావాదేవీలు గమనించి ట్యాక్స్ విధించాలన్నారు. ఇంటి ఆర్కిటెక్చర్‌కి చేసే ఖర్చు రూ.60 లక్షలు మించితే ఐదు శాతం టీడీఎస్ విధించవచ్చన్నారు. ఏడాదిలో రూ.50 లక్షలకు మించి వస్తువులు, సేవలు కొనుగోలు చేసే వారిపై కూడా 0.5 శాతం టీడీఎస్ ఉంటుందని, ఈ–కామర్స్ లావాదేవీలు కూడా దీని పరిధిలోకి వస్తాయని సూచించారు. క్రిప్టో కరెన్సీ లావాదేవీలపై అత్యధికంగా 30 శాతం ట్యాక్స్ విధించవచ్చని తెలిపారు. ప్రతి ఏడాది ఆదాయ పన్ను శాఖ జారీ చేసే నిబంధనలు తెలుసుకోవాలని సూచించారు. ఏదైనా సమస్యలు ఉంటే వెంటనే కమిషనర్ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

గంపెడాశలను ఆవిరి చేస్తూ..

- అనంతపురంలో ఉదయగిరి విద్యార్థి ఆత్మహత్య
- బై బై నాన్న.. అంటూ చివరి మెసేజ్
- తల్లడిల్లుతున్న తల్లిదండ్రులు



ఘటనా స్థలంలో విద్యార్థి మృతదేహం

ఉదయగిరి: కన్నబిడ్డపై పెట్టుకున్న కోటి ఆశలు చెదిరాయి. తమ బిడ్డ భవిష్యత్ ఉన్నతంగా ఉంటుందని భావించిన తల్లిదండ్రులకు తీరని విషాదం మిగిలింది. అనంతపురంలోని జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న కుమ్మిత చాణక్యానందరెడ్డి(19) హాస్టల్ భవనం మీద నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. ఉదయగిరి పట్టణంలోని బాలాజీనగర్‌కు చెందిన కుమ్మిత రమణారెడ్డి, విజయమ్మల ఏకైక కుమారుడు చాణక్యానందరెడ్డి. తండ్రి రమణారెడ్డి వరికుంటపాడు మండలం తిమ్మారెడ్డిపల్లి సబ్‌స్టేషన్‌లో విద్యుత్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. తల్లి విజయమ్మ గృహిణిగా ఉంది. చదువులో ఉన్నతంగా రాణిస్తున్న చాణక్యానందరెడ్డి జేఎన్‌టీయూలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఈ క్రమంలో నూతన సంవత్సర వేడుకలు జరుపుకునేందుకు ఉదయగిరి వచ్చి నాలుగు రోజులపాటు కుటుంబ సభ్యుల మధ్య ఆనందంగా గడిపాడు. రెండ్రోజుల క్రితం కళాశాలకు వెళ్లాడు. అక్కడ ఏం జరిగిందో కానీ హాస్టల్ భవనంపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిని గమనించిన సహచర విద్యార్థులు వెంటనే అధ్యాపకులకు తెలియజేశారు. అప్పటికే ఆ విద్యార్థి విగతజీవిగా మారాడు. ఈ ఘటనపై ఉదయగిరిలోని తల్లిదండ్రులకు సమాచారమిచ్చారు. హుటాహుటిన సంఘటనా స్థలానికి బయల్దేరి వెళ్లారు. చివరిసారిగా విద్యార్థి సెల్‌లో బై బై నాన్న.. అనే సందేశం తండ్రి సెల్‌ఫోన్‌కు పంపించాడు. కానీ ఆ సందేశం ఇంత విషాదాన్ని మిగిలిస్తుందని అనుకోలేదని తల్లిదండ్రులు బోరున విలపిస్తున్నారు. ఈ ఊహించని సంఘటనతో కుటుంబ సభ్యులు షాక్‌కు గురై కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. విద్యార్థి మృతితో స్వగ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.